



రోడ్డుపై పశువులు ఉండడంతో వాహనదారుల ఇబ్బందులు

విచ్చలవిడిగా సిట్టింగులు

- నివాస గృహాల మధ్యే యథేచ్ఛగా అమ్మకాలు
- నిబంధనలు బేఖాతర్
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు
- మద్యం అమ్మకాలే లక్ష్యంగా విధి నిర్వహణ



సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి వైన్ షాపు వద్ద సిట్టింగ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల మద్యం షాపుల్లో ఏర్పాటు చేసిన పర్మిట్ రూములు బార్‌లను తలపిస్తున్నాయి. నిబంధనలను గాలికి వదిలేసి పెద్దపెద్ద రేకుల షెడ్లు వేసి బెంచీలు, బల్లాలు వేసి యథేచ్ఛగా సిట్టింగులను నడిపిస్తున్నారు. ఆయా వైన్ షాపుల పక్కన, వెనుకాల నివాస గృహా లు ఉన్నా కూడా పర్మిట్ రూములను నడిపిస్తున్నారు. నిర్ణీత కొలతల ప్రకారం ఒక చిన్న గదిలో మాత్రమే పర్మిట్ రూములను నిర్వహించా ల్సిన వైన్ షాపుల యజమానులు పెద్ద ఎత్తున సిట్టింగులను నిర్వహిస్తు న్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రభుత్వం విధించే టార్గెట్‌ల మేరకు మద్యం అమ్మకాలపైనే దృష్టి సారిస్తూ చూసీ చూడ నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పర్మిట్ రూముల్లో ఎలాంటి బెంచీలు గానీ, బల్లలు గానీ వేయకుండా నిర్వహించాల్సి ఉంటుంది. కేవలం గ్లాసులు, మందు సీసాలు పెట్టుకునేందుకు మాత్రమే వాల్ చెక్కలు వేయాలి. కానీ ఒక్కో వైన్ షాపు యజమాని పెద్దపెద్ద షెడ్లను ఏర్పాటు చేసి సిట్టింగులను నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్, పోలీస్ శాఖాధికారులకు నెలనెలా మామూళ్లు ముట్టజెబుతూ బార్లను తలపించేలా పర్మిట్ రూములను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాయంత్రం అయ్యిందంటే చాలా వైన్ షాపుల పర్మిట్ రూములు బార్‌లను తలపిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 76 మద్యం షాపులు నడుస్తుండగా, 12 వరకు బార్‌లు ఉన్నాయి. వైన్ షాపు పర్మిట్ రూముల్లో నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌లు నిర్వహిస్తూ బార్ల గిరాకీని దెబ్బతీస్తున్నారు. ప్రతి వైన్ షాపునకు ఒక పర్మిట్ రూం తప్పనిసరి. ఇందుకోసం ఏడాదికి రెండు లక్షల రూపాయలు చెల్లిస్తున్నారు. గోదావరిఖని, రామ గుం డం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పట్టణాల్లో బార్లు ఉన్నాయి. ధర్మారం, అంతర్గాం, పాలకుర్తి, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూ ర్, ఓదెల, ఎలిగేడు, జూలపల్లి మండలాల్లో బార్లు లేవు.

- **ప్రజలకు ఇబ్బందులు..**

పట్టణ ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై ఉండే పలు వైన్ షాపులు, గల్లీల్లో ఉండే కొన్నిషాపుల్లో విచ్చలవిడిగా సిట్టింగులను నిర్వహిస్తున్నారు. మండలాలు, కొన్ని పట్టణాల్లో ఉన్న వైన్‌షాపుల్లో పర్మిట్ రూములను బార్ల వలే నిర్వహిస్తున్నారు. మద్యం ప్రియులకు కావాల్సిన తినుబండారాలు, వాటర్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, గ్లాసులు ఏర్పాటు చేసి సిట్టింగులను నిర్వహిస్తున్నారు. ఈ సిట్టింగుల వల్ల మద్యం ప్రియులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్దఎత్తున సిట్టింగులు నిర్వహిస్తుండడంతో అక్కడ గొడవలు కూడా జరుగుతున్నాయి. కొన్ని మండలాల్లో వైన్ షాపుల పక్కన, వెనుకాల నిర్వహించే పర్మిట్ రూములకు ఆనుకునే నివాస గృహాలు ఉన్నాయి. ఈ పర్మిట్ రూముల్లో సిట్టింగులను నిర్వహించడం వల్ల ఆయా గృహాల్లో నివసించే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదాయమే లక్ష్యంగా వైన్ షాపులకు టార్గెట్లు విధిస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు నిబంధనలను పాటిస్తున్నారా, లేదా అ న్నే విషయమై తనిఖీలు చేయడం లేదు. వైన్ షాపుల యజమానులు నెలనెలా ఇచ్చే మామూళ్లు తీసుకుని అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల వైన్ షాపుల యజమానులు సమయపాలన పాటించడం లేదు. ఇష్టారాజ్యంగా వైన్‌షాపులను నడిపిస్తున్నా కూడా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్ శాఖాధికారులు స్పందించి వైన్ షాపుల్లో పర్మిట్ రూములను తనిఖీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నివాస గృహాల పక్కన నిర్వహిస్తున్న పర్మిట్ రూములను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపైన ఆవులు, కోడెలు

- వాహనదారులకు ఇబ్బందులు • తరుచూ జరుగుతున్న ప్రమాదాలు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 10: పట్టణంలో రోడ్లపై సేద తీరుతున్న ఆవులు, కోడెలతో ప్రమాదకర పరిస్తితి నెలకొంది. పదులు సంఖ్యలో గుపులుగా చేరి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో పాటు ప్రమాదాలకు దారి తీస్తున్నాయి, రాత్రివేళల్లో వాహనాల లైట్లకు సరిగ్గా కనిపించక ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఎందరో గాయాలపాలయ్యారు. శాంతినగర్ నుంచి రంగంపల్లి వరకు, అలాగే పట్టణ వీధుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వాహనదారులు ఎంత హారన్లు మోగించినా మూగజీవాలు కదలడం లేదు. వారే దారి కల్పించుకొని వెళ్లాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో వాహనదారుల ఇక్కట్లు అన్నీఇన్ని కావు. ఏకంగా ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద మూగజీవాలు సేద తీరుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇవి ఎక్కడి నుంచి వచ్చాయే. ఎవరివి అనే వివరాలు సేకరించకపోవడం, కనీసం వాటిని రోడ్లపై నుంచి ఇతర ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికే పట్టణ కేంద్రంలో ప్రమాదాల సంఖ్య తరుచూ పెరుగుతూనే ఉంది. వీటితో మరింత పెరిగే అవకాశం ఉంది. పట్టణంలో ఎక్కడ చూసిన వాటి సందడే కన్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది స్పందించడం లేదు. లేగలు, ఆవుల మధ్య పోట్లాట జరిగినప్పుడు అత్యంత ప్రమాదకర వాతవరణం నెలకొంటుంది. బస్టాండ్, రైల్వే స్టేషన్ ఆవరణలో బీభత్సం సృష్టిస్తున్నాయి. మల మూత్రాలు పోసి పరిశుభ్రతను చెరిపేస్తున్నాయి. నిలిపిన వాహనాల బ్యాగుల నుంచి, వాహనానికి తగిలేసిన కవర్లను తీసి అందులో ఉన్న పండ్లు, కూరగాయలు తినేస్తున్నాయి. కూరగాయలు, పండ్ల దుకాణాలకు తీవ్రంగా నష్టం చేస్తున్నాయి. నిలిపివేసిన వాహనాలను పడేస్తున్నాయి. స్థానికులు మున్సిపల్, అధికారులు, పోలీసులుకు ఫిర్యాదులు చేసినా స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుపై ఉన్న ఆవులు, కోడెలు

సమస్యల పరిష్కారానికే 'జననాడి'

మంథనిరూరల్, ఆగస్టు 10: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించి అక్కడిక్కడే సమస్యలను పరిష్కరించడం కోసమే జననాడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు తెలిపారు. మండలంలోని గుంజపడుగులో ప్రజాసమస్యలను తెలుసుకొని ప్రజల వద్ద నుంచి వినతులను శనివారం స్వీకరించారు. ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలల్లో చాలా వరకు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు. మిగతా సమస్యలను త్వరలోనే పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా పాలన కొనసాగిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరస్తూ రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తున్నామన్నారు. మంథని నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసం తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నేతలు ఊదరి శంకర్, ఊదరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ప్రాణాల కన్నా ఉత్పత్తి ప్రధానం కాదు

- రక్షణలేని ఉత్పత్తి అవసరం లేదు
- సింగరేణి సీఎండీ బలరాం

8

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలివ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు టి. సాగర్

6

బస్టాండ్ స్లాబ్ కూల్చివేత పనులు షురూ

- ప్రయాణికుల కోసం తాత్కాలిక షెడ్డు ఏర్పాటు

సుల్తానాబాద్, ఆగస్టు 10: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరుకోడంతో సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల నివేదిక ఆధారంగా బస్టాండ్ స్లాబ్ కూల్చివేస్తున్నారు. స్లాబ్ కూల్చే పనులను శనివారం ఉదయం ప్రారంభించారు. ఈ మేరకు ప్రత్యామ్నాయంగా ప్రయాణికుల కోసం తాత్కాలిక షెడ్లులు ఏర్పాటు చేశారు. సుల్తానాబాద్ పట్టణంలో 42 ఏళ్ల క్రితం నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఇప్పటికే రెండు, మూడుసార్లు స్లాబ్ పైకప్పు శిథిలాలు కూలి పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు వచ్చి బస్టాండ్ భవనాన్ని పరిశీలించి కూల్చివేయాలని నిర్ణయానికి వచ్చారు. వారి నిర్ణయం మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం సుల్తానాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో స్లాబ్ కూల్చివేత పనులు ప్రారంభించారు. బస్టాండ్ పరిసరాల్లో ఎవరు ఉండకుండా చుట్టూ బారికేడ్లు నిర్మించి స్లాబ్ కూల్చివేత పనులు కొనసాగిస్తున్నారు. తాత్కాలికంగా తడకల షెడ్డును ఏర్పాటు చేశారు. బస్సులు అక్కడే నిలిపేవిధంగా చర్యలు తీసుకున్నారు. అయితే స్లాబ్ కూల్చివేత అనంతరం బీములపై రెండు అడుగుల ఎత్తు గోడ నిర్మించి ఆ గోడపై ఐరన్ రాడ్లు బిగించి గోదా ముల మాదిరిగా రేకులు ఏర్పాటు చేసి తిరిగి బస్టాండ్‌ను ఉపయోగం లోకి తెస్తారని చెబుతున్నారు. ఈ పనులు పూర్తికావడానికి దాదాపు రెండు నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా షెడ్డు లేకపోవడంపై పట్ల ప్రయాణికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

- **శాశ్వత భవన సముదాయాన్ని నిర్మించాలి..**

శిథిలావస్థకు చేరిన ఆర్టీసీ బస్టాండ్‌ను పూర్తిగా తొలగించి దాని స్థానంలో నూతనంగా బస్టాండ్‌లో అదనపు ప్లాట్‌ఫామ్‌లతో బస్సుల రద్దీకి అనుగుణంగా నిర్మించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన నూతన బస్టాండ్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సుల్తానాబాద్ బస్టాండ్ స్లాబ్ కూల్చివేసిన అధికారులు



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డు వద్ద ప్రయాణికులు

వేపచెట్టును తొలగించడంపై ఆగ్రహం



ఖనిలో వేపచెట్టును నరికివేసిన కార్పొరేషన్ సిబ్బంది

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 10: గోదావరిఖని రాజేష్ థియేటర్‌కు ఎదురుగా ఉన్న పచ్చని వేపచెట్టును శనివారం రామగుండం కార్పొరేషన్ సిబ్బంది తొలగించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షాపుల ముందు ఉన్న నీడనిచ్చే వేపచెట్టు విద్యుత్ తీగలకు అడ్డు లేకున్నా అకారణంగా చెట్టును నరికివేయడం సరికాదని, షాపులు తెరవక ముందే సిబ్బంది చెట్టును నరికివేయడంపై స్థానికులు వ్యతిరేకిస్తున్నారు.

పల్లెల్లో పెరుగుతున్న జ్వర పీడితులు

- గుంపులలో పలువురికి టైఫాయిడ్ - ముందస్తు చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం

ఓదెల, ఆగస్టు 10: మండలంలో 22 గ్రామాలకు మూడు గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లో రోజురోజుకు జ్వర పీడితులు పెరుగుతున్నారు. అలాగే చికెన్ గున్యా, టైఫాయిడ్, జ్వరాలతో గ్రామాలకు, గ్రామాలు మంచం పట్టాయి. ప్రతిరోజు ఓదెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 100 నుంచి 150 మంది జ్వర పీడితులు వస్తూ చికిత్స పొందుతున్నారు. అయినప్పటికీ వీరికి జ్వరాలు తగ్గడంలేదు. ఓదెలతో పాటు కనగర్తి, పొత్కపల్లి, కొలనూర్ కొమిర, నాంసానిపల్లి, అబ్బిడిపల్లి, లంబాడ తండ, ఇందుర్తి, గుంపుల, గూడెం, ఉప్పరపల్లి, బాయమ్మపల్లితోపాటు తదితర గ్రామాల్లో జ్వరాలు అధికమయ్యాయి. అలాగే గుంపులలో గట్టు మహేష్, మర్రి శ్రీనివాస్, బొమ్మ అశోక్‌తోపాటు మరో ముగ్గురు టైఫాయిడ్ జ్వరంతో అనారోగ్యానికి గురయ్యారు. అలాగే వైరల్ జ్వరాలు తీవ్రమై రక్త కణాలు తగ్గి బాధపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో గుంపులకు చెందిన పలువురు జ్వరపీడీతులు జమ్మికుంట ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేసుకోగా ఇద్దరికీ రక్త కణాలు తగ్గిపోయాయి. అలాగే ముగ్గురికి టైఫాయిడ్ వచ్చినట్లు వైద్యులు నిర్ధారించారు. అలాగే చికున్ గున్యాతో గ్రామాల ప్రజలు కీళ్ల నొప్పులు, కండరాలు వాపేక్కుతుండడంతో పట్టణాల్లోని ప్రయివేటు ఆసుపత్రుల వెంట తిరుగుతున్నారు.

- **ముందస్తు చర్యల్లో అధికారులు విఫలం**

గ్రామాల్లో ప్రతి శుక్రవారం నిర్వహించే పారిశుద్య పనులను చేపట్టకపోవడంతో కాలువల్లో మురికి నీరు నిలిచి దోమలు ఎక్కువయ్యాయి. మృగశిర కార్తెలో ముందస్తుగా పారిశుధ్య పనులు చేపట్టినట్లయితే గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉండేది కాదు. సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1న పూర్తికాగా అనంతరం స్పెషల్ అధికారుల పాలన ప్రారంభమైంది. అప్పటినుంచి మురికి కాలువల్లో నీటి నిల్వలు అలాగే కాలువల వెంట జంగల్ కటింగ్, ఇండ్లలో నీటి నిలువ నివారణ తదితర పారిశుధ్య పనులు చేపట్టలేదు. దీంతో జ్వరాలు తీవ్రం అయినకొద్దీ నెమ్మదిగా వైద్యులు, అధికారుల స్పందన మొదలైనప్పటికీ కొన్ని గ్రామాల్లో ఇప్పటికి పారిశుధ్య పనులు చేపట్టలేదని విమర్శలు వస్తున్నాయి. ఓదెల మూడవ వార్డు ప్రధాన రహదారి రేషన్ షాపు వద్ద పక్కన ఉన్న మురికి కాలువల్లో పూడిక నిండిపోయి మురికి నీరు మరుగుదొడ్ల నీరంతా నిలిచిపోయి వీధుల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి అలాగే దుర్గంధంతో వీధివాసులు, బాటసారులుతీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ఉప్పరపల్లిలో కుక్క సందీప్, పల్లె ప్రశాంత్, పల్లె సంపత్, దాసరి శివ, పల్లె వజ్రమ్మ, పల్లె సుశీల ఇటీవల డయేరియా నుంచి బయటపడగా, మరో ఐదుగురు ఇదే ఆనవాళ్ళతో ప్రస్తుతం సుల్తాబాద్ ఆసుపత్రికి వెళుతున్నారు. ప్రభుత్వ వైద్యులు సక్రమంగా వైద్య పరీక్షలు, చికిత్స శిబిరాలు, అవగాహన సమావేశాలు, రక్తనమునాలు నిర్వహించక పోవడంతో విధి లేని పరిస్థితుల్లో ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో నామమాత్ర వైద్య శిబిరాలు నిర్వహించినప్పటికీ ఎలాంటి రక్తం నమూనాలను సేకరించలేదని అలాగే ఎలాంటి జ్వరాలు అనేవి నిర్ధారించలేదని ఉప్పరపల్లి, ఓదెల, గుంపుల, గూడెం, గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఓదెల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

డిపో ఆదాయాన్ని పెంచడానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఆర్ఎం సుచరిత

మంథని, ఆగస్టు 10: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మంథని ఆర్టీసి డిపోకు అధిక ఆదాయాన్ని తీసుకురావటానికి ఉద్యోగులు కృషి చేయాలని కరీంనగర్ ఆర్ఎం సుచరిత సూచించారు. శనివారం మంథని డిపోను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగులతో గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉద్యోగులు నడుచుకుంటూ ఆదాయాన్ని పెంచుకోవటానికి కృషి చేయాలన్నారు. డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి, డీఎం శ్రావణ్‌కుమార్, ఏడీఎం ఎంజేల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెళ్లిళ్లు, విహారయాత్రలకు ఆర్టీసీ ఆఫర్

కళ్యాణనగర్, ఆగస్టు 10: శ్రావణమాసం కావడం, అధిక శుభముహర్తాల దృష్ట్యా పెళ్లిళ్లు, విహారయాత్రలకు ఆర్టీసీ కాంట్రాక్టు పద్ధతిలో బస్సులపై 10శాతం రాయితీతో బస్సులను ఇస్తున్నట్లు గోదావరిఖని ఆర్‌టీసీ డీపో మేనేజర్ ఎం నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాయితీ ఈనెల 5వ తేదీ నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు ఇచ్చే బస్సులకు మాత్రమే వర్తిస్తుందని కావున ఈ సదావశాకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9908138036, 7989847927లో సంప్రదించాలని తెలిపారు.



అత్తింటి వారి దాష్టీకం

- భర్త సంవత్సరీకానికి ఇంటికి వచ్చిన మహిళ
- తాళం వేసుకొని వెళ్లిపోయిన అత్తామామలు

హుజూరాబాద్, ఆగస్టు 10: అనారోగ్యంతో భర్త చనిపోగా పిల్లలతో కాలం వెళ్లదీస్తున్న క్రమంలో అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నారు. శనివారం భర్త సంవత్సరీకం పెట్టేందుకు ఇంటికి రాగా అత్తామామలు తాళం వేసుకొని వెళ్లిపోయారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణానికి చెందిన శ్రావణ్‌కు ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామానికి చెందిన రవళితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. గత ఏడాది ఆగస్టు నెలలో శ్రావణ్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. ఇల్లును ఖాళీ చేసి వేరే చోట ఉండాలని చెప్పడంతో రవళి వేరే చోట నివాసం ఉంటుంది. భర్త సంవత్సరీకం చెద్దామని శనివారం ఇంటికి రాగా అత్తామామలు ఇంటికి తాళం వేసుకొని వెళ్లిపోయారు. చేసేది ఏం లేక ఇంటి ఎదుట భర్త ఫొటో పెట్టుకుని రవళి తన పిల్లలతో కలిసి సంవత్సరీకం నిర్వహించింది. చుట్టు పక్కల వారు ఈ పరిస్థితిని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తమ అత్తామామలు వేధింపులకు గురి చేస్తున్నారని, తనకు, తన బిడ్డలకు న్యాయం చేయాలని రవళి వేడుకుంది.

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలివ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు టి సాగర్


నినాదాలు చేస్తున్న నాయకులు

గోదావరిఖని, ఆగస్టు 10: రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్న నిరుపేదలకు పట్టాలిచ్చి సౌకర్యాలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి సాగర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పవర్‌హౌస్ కాలనీలోని ప్రైవేట్ గార్డెన్స్‌లో సీపీఎం పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ తెలంగాణ రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మహేశ్వరి పార్టీ జెండా ఆవిష్కరించగా జిల్లా కార్యదర్శి యాకయ్య తరగతులను ప్రారంభించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి నిరుపేదలు ఇళ్లు నిర్మించుకొని నివాసముంటుంటే సరైన రోడ్లు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు ఇళ్లు కేటాయింపునకు బడ్జెట్‌లో నిధులేమి లేవన్నారు. నిరుపేదలకు కేంద్రప్రభుత్వం 10లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి 5 లక్షల రూపాయలు ఇవ్వడమేకాకుండా పట్టాలు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తరగతులకు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లిల్లల బాలకృష్ణ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో వేల్పుల కుమార స్వామి, ఎం రామాచారి, భాగ్య, అనూష, సృజన, భవాని, మహేశ్వరి, జమున, వాణి, శివ కుమార్, సతీష్, బాలకృష్ణ, క్రాంతి, పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల నుంచి గుడిసె వాసులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ

ధర్మపురి, ఆగస్టు 10: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో మొదటి శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయాల్లో ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరిలో స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

గురుకుల విద్యార్థి అనిరుధ్ అంత్యక్రియలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 10: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులం అస్వస్థతకు గురై మృతి చెందిన విద్యార్థి ఎడమల్ల అనిరుధ్ అంత్యక్రియలను బాలుడి అమ్మమ్మ ఊరు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో శనివారం నిర్వహించారు. మృతుడి తండ్రి కృష్ణారెడ్డి గల్ఫ్ నుంచి చేరుకోవడంతో అంతిమ సంస్కారాలు జరిపించారు. కన్న కొడుకు చనిపోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

అనిరుధ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

విద్యార్థి అనిరుధ్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో విద్యార్థి అనురుధ్ మృతదేహం వద్ద శనివారం నివాళులు అర్పించారు. అనంతరం ఇటీవల నారాయణపూర్‌లో గుండెపోటుతో మృతి చెందిన లింగాల సురేశ్ కుటుంబ సభ్యులతోపాటు మండల కేంద్రంలో కుక్కల దాడిలో గాయ పడిన చిన్నారులను కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, లింగాగౌడ్, రాంరెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, రాజు, శ్రీనివాస్, రాములు ఉన్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య


రమేష్ మృతదేహం

సైదాపూర్, ఆగస్టు 10: మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన కొలకాని రాజు (32) అనారో గ్యంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆరోగ్యం దెబ్బతిని కడుపునొప్పి వచ్చేది. శుక్రవారం కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డు పైపునకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. రాజు భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

ద్విచక్ర వాహనాల చోరీ ముఠా అరెస్ట్




నేరాలకు పాల్పడిన నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ, చోరీకి గురైన ద్విచక్ర వాహనాలు

మెట్‌పల్లి , ఆగస్టు 10 (ఇబ్రహీంపట్నం): రద్దీగా ఉన్న ప్రాంతంలో బైకులు పార్క్ చేసి హ్యాండిల్ లాక్ వేయకుండా ఉన్న ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న దొంగల ముఠాను మెట్‌పల్లి పోలీసులు పట్టుకుని కటకటాలకు పంపారు. జగిత్యాల జిల్లా పరి ధిలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల టౌన్, గొల్లపల్లితో పాటు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, కమ్మర్‌పల్లి, పోలీస్ స్టేషన్ పరిధిలో కొంత కాలంగా హ్యాండిల్ లాక్ వేయని ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను, దొంగ సొత్తును కొన్న మరో ఇద్దరు నిందితులను శనివారం మెట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను ఎస్పీ పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం గుమ్మిర్యాల గ్రామానికి చెందిన మన్నే లక్ష్మణ్ గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాడు. ప్రమాదవశాత్తు కాలు విర గడంలో డ్రైవర్ వృత్తి మానేసి మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడ్డాడు. సు లువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో దొంగతనాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో హ్యాండిల్ లాక్ వేయని బైక్‌లను లక్ష్యం చేసుకుని రద్దీగా ఉండే మార్కెట్ ఏరియా, ఆసుపత్రులు, వివిధ షాపుల ముందు నిలిపిన బైక్‌లను దొంగతనం చేయడం ప్రారంభించాడు. ఇందుకు ముందుగా వివిధ రకాల మోటార్ సైకిళ్ల తాళం చేవిలని సేకరించి వాటి సహాయంతో ద్విచక్ర వాహనాలను చోరీ చేసేవాడు. గత సంవత్సరం నుంచి జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలో మొత్తం 6 లక్షల విలువ గల 20 ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. జగిత్యాల జిల్లాలో 13 బైక్‌లు, నిజామాబాద్ జిల్లాలో 7 బైక్‌లు అపహరించారు. చోరీ చేసిన బైక్‌లను నిర్మల్ జిల్లా మామడ మండలం పొం కల్ గ్రామానికి చెందిన మోహమ్మద్ మోసిన్ (ఏ2) చికెన్ షాపు నిర్వహకుడికి, అబ్దుల్ రషీద్‌కు(ఏ3) బైక్ మెకానిక్ షాపు నిర్వాహకుడు ఇద్దరికి చెరో 10 ద్విచక్ర వాహనాలను ఒక్కో బైక్‌ను 8 వేల నుంచి 10 వేల రూపాయల చొప్పున అమ్మి వచ్చిన డబ్బులని జ ల్సాలకు ఖర్చు చేసేవాడు. దొంగ సొత్తు అని తెలిసి కూడ మోహమ్మద్ మోసిన్ అబ్దుల్ రషీద్ లక్ష్మణ్ వద్ద తక్కువ ధరకు కొని ప్రజలకు ఎక్కువ ధరలకు అమ్మి సోమ్ము చేసుకునే వారు.

కొంత కాలంగా ద్విచక్ర వాహనాల చోరీలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు పర్యవేక్షణలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగిస్తూ బృందాలుగా ఏర్పడి పట్టణ శివారులోని వెంకట్రావ్‌పేట వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా వస్తున్న లక్ష్మణ్‌ని పట్టుకుని విచారించగా ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసినట్లు అంగీ కరించడంతో అతనితో పాటు మిగతా నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నింది తులను పట్టుకోవడంలో చకచాక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

రూ. 27000 నగదు ద్విచక్ర వాహనం స్వాధీనం

కోరుట్ల: దొంగతనాలకు పాల్పడుతున్న ఒక మైనర్‌తో పాటు మరో వ్యక్తిని కోరుట్ల పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. శనివారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ కిరణ్ కుమార్‌తో కలిసి సీఐ అరెస్టు వివ రాలను వెల్లడించారు. పట్టణంలోని కావేరి గార్డెన్ వద్ద ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఒక యువకుడు, మరో బాలుడు అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. జగిత్యాల మండలం పొలాస గ్రామానికి చెందిన హర్షద్ అతని అల్లుడిగా గుర్తించారు. హర్షద్ అతని అల్లుడితో కలిసి చోరీలకు అలవాటు పడ్డారు. ఈ నెల 5వ తేదీన కోరుట్ల పట్టణంలో ఇద్దరు కలిసి ఓ ద్విచక్ర వాహనం, 7వ తేదీన ఐబీ రోడ్డులోని ఓ కిరాణం దుకాణంలో షెటర్ తాళం పగులగొట్టి దుకాణంలోని రూ 27,000 ఎత్తుకెళ్లారు. కోరుట్ల పట్టణంతో పాటు జగిత్యాల జిల్లా పరిధిలోని వివిధ చోరి కేసుల్లో వీరు నిదితులుగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద ఉన్న 27,000 నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులో చాక్యచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ, కానిస్టేబుల్స్ ఎల్లయ్య, సత్తయ్య, సాగర్, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్ బాబు

బాలుడిపై వీధి కుక్క దాడి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10 : మండలంలోని రామలచ్చక్కపేట గ్రామంలో బాలుడిపై వీధి కుక్క దాడి చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామంలోని ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ల బాలుడు నిహాన్స్‌ను వీధి కుక్క అకస్మాత్తుగా దాడి చేసింది. దీంతో బాలుడు అరవడంతో ఇంట్లో కుటుంబ సభ్యులు గమనించి కుక్కను తరిమి గాయపడ్డ నిహాన్స్‌ను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామాల్లో వీధి కుక్కలతో చిన్నపిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ప్రజలు పేర్కొంటున్నారు. వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, ఆగస్టు 10: విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మానకొండూర్ సబ్‌స్టేషన్‌లో జేఎల్‌ఎంగా కార్తీక్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన చేయాల్సిన పనులను మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన చొప్పరి బుచ్చయ్యతో చేయిస్తుంటాడు. మానకొండూర్ శివారు గ్రామమైన బంజేరుపల్లిలో రెండు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేస్తుండగా బుచ్చయ్య విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ బుచ్చయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు.

ఆపదలో ఉన్న వృద్ధుడికి అండ

అనాథాశ్రమంలో చేర్పించిన సీఐ సరిలాల్


లింగయ్యను ఆశ్రమానికి అప్పగిస్తున్న సీఐ సరిలాల్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10: ఇద్దరు కూతుర్లు ఉన్నా ఎవరూ అతని పోషణ పట్టించుకోకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో ఎక్కడికి వెళ్లాలో తెలియక ఓ వృద్ధుడు కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకుని అక్కడే గడుపుతుండగా శనివారం కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్ చేరదీసి కరీంనగర్‌లోని వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమంలో చేర్పించారు. సీఐ సరిలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేటకు చెందిన ఇల్లందుల లింగయ్య దిక్కుతోచని స్థితిలో కరీంనగర్ బస్టాండ్‌లో తిరుగుతూ సీఐ సరిలాల్‌కు కనిపించాడు. లింగయ్య వివరాలు సేకరించగా తనకు ఇద్దరు కూతుర్లు ఉన్నారని, ఎవరూ తన ఆలనాపాలనా చూడకపోవడంతో మనస్థాపంతోనే బస్టాండ్‌కు చేరుకున్నానని వృద్ధుడు లింగయ్య తన బాధను సీఐతో వెల్లగక్కాడు. వెంటనే సీఐ సరిలాల్ కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీలోని వీడీ ఫౌండేషన్ వీరబ్రహ్మేంద్ర అనాథవృద్ధుల ఆశ్రమం నిర్వాహకుడు వీరమాధవ్‌కు సమాచారం అందించాడు. వీరమాధవ్‌ను ఠాణాకు పిలిపించుకుని వృద్ధుడు లింగయ్య బాగోగులు చూసుకోవాలని అతన్ని అప్పగించారు. వీరమాధవ్‌ను సీఐతో పాటు స్థానికులు అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో లారీ డ్రైవర్ ఆత్మహత్య


రమేష్ మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 10: పట్టణానికి చెందిన మురుకుట్ల రమేష్ (49) అనే లారీ డ్రైవర్ ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. రమేష్ ఫైనాన్స్‌లో 5 లక్షల లోన్ తీసుకొని లారీని కొన్నాడు. ఆ తరువాత 12 లక్షల లోన్ తీసుకుని మరో లారీ కొన్నాడు. వర్షాల కారణంగా రెండు నెలలపాటు లారీ నడవకపోవడంతో ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లించలేదు. ఫైనాన్స్ కంపెనీకి చెందిన వ్యక్తులు ఇటీవల రమేశ్ ఇంటికి వచ్చి గొడవ చేశారు. మనస్తాపం చెందిన రమేష్ ఈ నెల 8న పురుగుల మందు తాగగా కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. రమేష్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రమేష్ భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. రమేష్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ చైర్మెన్ కొత్తూరి మహేశ్, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి ఐదు వేల నగదును రమేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

శ్రీపాద నుంచి తగ్గిన ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,602 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.846 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గుముఖం పట్టడంతో ఒక మోటార్ నుంచే నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.18 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు నుంచి సర్జిపూల్‌కు వచ్చిన నీటిని రెండు పంపుల ద్వారా ప్రతిరోజు 6,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్‌కు ప్రతిరోజు 6,600 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 3,700 క్యూసెక్కులు ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 17.06 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. అన్నపూర్ణ ప్రాజెక్ట్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు తగ్గిన నీటి విడుదల

జగిత్యాల: వానాకాలం పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను శనివారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 500 క్యూసెక్కులు తగ్గింపుతో 2,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 3,333 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 3,333 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కొండగట్టుకు శ్రావణ శోభ

● అంజన్నను దర్శించుకున్న వేలాది భక్తులు


శేషవాహనంపై స్వామివారు

మల్యాల, ఆగస్టు 6: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం శ్రావణ శోభను సంతరించుకుంది. శనివారం వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. శ్రావణ సప్తాహ ఉత్సవాలు శనివారం కూడా కొనసాగాయి. అంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన రత్నమాల అనే భక్తురాలు దైవదర్శనానికి వచ్చి చేతిబ్యాగ్ పోగొట్టుకోగా ఏఎస్సై చిలుక శ్రీనివాస్, హోంగార్డు రమేష్‌లు బ్యాగు వెతికి భక్తురాలికి అప్పగించారు.

బీసీ కమిషన్ సభ్యుడి పూజలు

బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రత్ పటేల్ శనివారం ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కటుంబ సమేతంగా వచ్చిన వారికి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అధికారులు శాలువాలతో సత్కరించారు.

పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 10: ఈనెల 31, సెప్టెంబరు 1, 2తేదీలలో హైదరాబాద్‌లో జరుగనున్న పీవోడబ్ల్యూ 7వ రాష్ట్ర మహాసభలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కె జ్యోతి పిలుపునిచ్చారు. శనివారం గోదావరిఖనిలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మహాసభల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ఇతర సమస్యలపై చర్చించి భవిష్యత్‌లో కార్యచరణను రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నిందితులపై కఠినచట్టాలు అమలు చేయలేకపోయారన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా కఠినంగా వ్యవహరించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా బాధ్యులను శిక్షించి మహిళలను రక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి రజిత, బుచ్చమ్మ, మంగ, అమృత, స్వప్న, సరోజన, కవిత, పద్మ, శారదా, సత్యమ్మ, పద్మ, స్వర్ణలత పాల్గొన్నారు.

పల్లె నుంచి ఢిల్లీకి..

స్వాతంత్ర్య వేడుకలకు విద్యార్థినికి ఆహ్వానం


శ్రీచందన

రాయికల్, ఆగస్టు 10: రాయికల్ మండలంలోని రామారావుపల్లె గ్రామానికి చెందిన విద్యార్థిని పంబాల శ్రీచందను ఈ నెల 15వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య వేడుకలకు హాజరు కావాలని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి ఆహ్వానం అందింది. భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించిన దేశ భక్తుల వేషధారణ పోటీలో శ్రీచందన సుభాష్ చంద్రబోస్ వేషం ధరించి పోటీలో పాల్గొనగా దేశవ్యాప్తంగా 250 మందిని ఎంపిక చేశారు. ఎంపికైనవారితో పాటు వారి సహాయకులకు స్వాతంత్ర్య వేడుకలు వీక్షించేందుకు ఆహ్వానం అందిందని గైడ్ టీచర్ కడకుంట్ల అభయ్‌రాజ్ తెలిపారు.

ఆగిఉన్న గూడ్స్ రైలులో అగ్నిప్రమాదం

జగిత్యాలరూరల్, ఆగస్టు 10 : జగిత్యాల పట్టణంలోని లింగంపేట రైల్వేస్టేషన్‌లో ఆగిఉన్న గూడ్స్ రైలులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రైల్వే అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగంపేట రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలులో బొగ్గువ్యాగన్‌లో మంటలు చూసి స్టేషన్‌మాస్టర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన జగిత్యాల అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని వెంటనే మంటలను ఆర్పివేశారు. ఈసంఘటనలో సుమారు రూ. 5 లక్షల వరకు నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి ఎ. కృష్ణకాంత్ తెలిపారు. మంటలు ఎలా వ్యాపించాయి అనేది అధికారులు విచారణ చేస్తున్నారు. ఎల్ఎఫ్ రవీంధర్, ఆపరేటర్ మల్లేశం, ఫైర్ మన్‌లు నరేష్, కార్తీక్, అరుణ్, శ్రీనివాస్ ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిని కలిసిన జీఎం


రాంచందర్‌కు అభినందనలు తెలుపుతున్న జీఎం సూర్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 10: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌ను ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతం నుంచి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమితులవడం గొప్పవిషయమని అన్నారు. సింగరేణిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, ఎస్సీ ఉద్యోగుల రిజర్వేషన్ సంబంధిత అంశాలపై చర్చించారు. జీఎం వెంట డీజీఎం రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

విధుల్లో చేరిన అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 10: బదిలీల్లో భాగంగా ఆర్జీ-2 ఏరియాకు వచ్చిన అధికారులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎంవీటీసీ మేనేజర్‌గా మురళీకృష్ణకు ఎంవీటీసీ, అంఫ్టీ సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. బదిలీపై ఆర్జీ-2 సేఫ్టీ ఆఫీసర్‌గా వచ్చిన సంతోష్‌కుమార్‌కు ఎంవీటీసీ మేనేజర్ మురళీకృష్ణతో పాటు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఎంవీటీసీ మేనేజర్‌గా పనిచేసి డిప్యుటేషన్‌పై తెలంగాణ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్తున్న రంగారెడ్డిని ఎంవీటీసీ సిబ్బంది ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు.

కార్మికుల ప్రాణాల కన్నా ఉత్పత్తి ప్రధానం కాదు

రక్షణలేని ఉత్పత్తి అవసరం లేదు - సేఫ్టీ, మైన్స్ కమిటీ ప్రతినిధులతో సీఎండీ వీడియోకాన్ఫరెన్స్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

గోదావరిఖని, ఆగస్టు 10: బొగ్గు ఉత్పత్తి కన్నా కార్మికుల ప్రాణాలు విలువైనవని, రక్షణ లేని ఉత్పత్తి అవసరం లేదని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం పేర్కొన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాలకు చెందిన సేఫ్టీ, మైన్స్ కమిటీ సభ్యులు 1500 మందితో శనివారం సీఎండీ బలరాం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రక్షణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సుదీర్ఘంగా జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రతి ఏరియా నుంచి రక్షణపై కార్మికుల నుంచి సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ బలరాం మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తిలో అత్యుత్తమ కంపెనీగా సింగరేణి నిలిచినప్పటికీ, ప్రమాదాల నివారణలో మాత్రం వెనకబడి ఉన్నట్టు అభిప్రాయపడ్డారు.

మానవ తప్పిదాల కారణంగా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రతి పనికి కొన్ని ఎస్‌ఓపీ(సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్) నిర్దేశించబడ్డాయని, వీటిని అనుసరించకపోవడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్టు సీఎండీ అన్నారు. విధిగా ప్రతి ఉద్యోగి ఎస్‌ఓపీ పాటించాలని సూచించారు. కార్మికుల రక్షణకు ఖర్చుకు వెనకాడకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆసుపత్రుల్లో అవసరమైన ప్రత్యేక వైద్య నిపుణులను నియమి స్తున్నామని, రామగుండం ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా రూపుదిద్దుతున్నట్టు సీఎండీ పేర్కొన్నారు. సూపర్ వైజర్లు, ఉద్యోగుల కొరత తీర్చేందుకు 1800 పోస్టులకు ఇప్పటికే నియమక ప్రక్రియ చేపట్టినట్టు, రానున్న రెండు నెలల్లో ఈప్రక్రియ పూర్తికానున్నదని తెలిపారు.

కార్మిక కాలనీలను గేటెడ్ కమ్యూనిటీలుగా తీర్చిదిద్దే ప్రణాళికతో పనిచేస్తున్నామని దీనికి అందరూ సహకరించాలని బలరాం కోరారు. ప్రస్తుత కాలంలో చాలా మంది ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సింగరేణిలో ఉద్యోగాలు సాధించిన యువత అంకితభావం, సంస్థ పట్ల కృతజ్ఞతతో పనిచేయాలని కోరారు. గనిలో జరిగే ప్రమాదాల కన్నా రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది యువ కార్మికులు మృతి చెందడం బాధాకరమైన విషయమని అన్నారు. రక్షణపై అవగాహనకు ఎంవీటీసీల్లో ప్రత్యే శిక్షణ ఇప్పించనున్నామని, ఎంవీటీసీలను ఆధునికీకరించనున్నట్టు బలరాం పేర్కొన్నారు. వారసత్వ ఉద్యోగాల కారణంగా ఉన్నత చదువులు చదివిన యువకులు సింగరేణిలో చేరారని, వారికి గనిలో పని చేయడంలో మరింత ప్రత్యేక శిక్షణ అవసరమన్నారు. సుమారు నాలుగు గంటలకు పైగా జరిగిన సమీక్షా సమావేశంలో ప్రతి ఏరియా నుండి కార్మికులు నేరుగా సీఎండీతో మాట్లాడారు. ఈసమావేశంలో డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, డీ సత్యనారాయణరావు, వెంకటేశ్వరరెడ్డి, జీఎం(కోఆర్డినేషన్) సుభాని, జీఎం(మార్కెటింగ్) రవిప్రసాద్‌తో పాటు కార్పొరేట్ స్థాయి జీఎంలు, అన్ని ఏరియా జీఎంలు తదితరులు పాల్గొన్నారు.

'ట్రినిటి'లో అలరించిన ఎల్లో డే వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 10: స్థానిక ట్రినిటి ప్రాథమిక పాఠశాలలో రే అఫ్ సన్ షైన్ పేరుతో శనివారం ఎల్లో డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎల్లో డే ప్రాముఖ్యతను తెలిపే విధంగా వేదికను అలంకరించి, చిన్నారులతో వివిధ కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఎల్లో డే యొక్క విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ప్రకృతి ప్రసాదించిన వివిధ వర్ణాల ప్రాముఖ్యతను వివరించారు. వాటి ప్రభావం మానవాళిపై ఏ విధంగా ఉంటుందో విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయంలో మొక్కలు నాటిన ప్రముఖులు

సుల్తానాబాద్, ఆగస్టు 10: స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని పురస్కరించుకొని సుల్తానాబాద్ పట్టణంలోని పాత శివాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాలయం ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, ఆలయ చైర్మన్ అల్లంటి సత్యనారాయణ, డైరెక్టర్లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంత ప్రజలకు పలు రకాల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పూలరాజు రవీందర్, దూడెం లింగమూర్తి, వెంకటేశ్వర్లు, కొమురవెల్లి అంజయ్య, బొడ్ల శ్రీనివాస్, అల్లాడి భగవాన్, వల్లం కొండ మహేష్, కొయ్యడ శీను, అరుణ్, ప్రసాద్, సాయి భూమయ్య పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్, ఆగస్టు 10: శ్రావణ మాసం పురస్కరించుకొని మొదటి శనివారం సందర్భంగా పట్టణంలోని శివాలయంలో లక్ష వత్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో పల్ల వనిత సంతోష్ స్వామి వారికి పలు రకాల పండ్లతో రుద్రాభిషేకం చేశారు. అన్న పూజ, లక్ష వస్త్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆలయ కమిటీ శివాలయం భక్త బృందం పాల్గొన్నారు. శ్రావణమాసంలో ఈ ఆలయంలో ప్రతి సోమవారం శుక్రవారం, శనివారం, మంగళవారం విశేష పూజలు నిర్వహిస్తున్నారు.

బ్రాస్‌బ్యాండ్ వర్కర్స్ యూనియన్ కమిటీ

ధర్మారం, ఆగస్టు 10: మండల బ్రాస్‌బ్యాండ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం వ్యవసాయ మార్కెట్ యార్డులో బ్రాస్‌బ్యాండ్ వర్కర్స్ యూనియన్ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏదుల్లా అంజయ్య, ఉపాధ్యక్షులుగా పక్కిడి పాష, సున్నం లక్ష్మణ్, ప్రధానకార్యదర్శిగా గోలాడ స్వామి, ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కాదాశీ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

ఆర్థిక సహాయం

రామగిరి, ఆగస్టు 10: మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన సందెవేన బాణయ్య ఇటీవల ప్రమాదంలో గాయపడగా శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోల్మామూరి శ్రీనివాస్, మాజీ జెడ్‌పీటీసీ గంటవెంకటరమణరెడ్డి, ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి, మేకల శరణ్య, మారుతీ, దోడ్ల శ్రీనివాస్, గాండ్ల మోహన్, ప్రతాప్‌రెడ్డి, కళాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

పాలకుర్తి, ఆగస్టు 10: విధుల్లో చేరిన నాటి నుంచి సంస్థ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసే ప్రతీ ఉద్యోగికి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని కేశోరాం సిమెంటు కంపెనీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ అన్నారు. కంపెనీలో మెకానికల్ విభాగంలో ఫిట్టర్‌గా విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ పొందిన కార్మికుడు గొల్లపల్లి సుధాకర్‌ను హెచ్‌ఆర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి పట్టు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ శ్రీనివాస రెడ్డి, హెచ్‌ఆర్ అండ్ ఐఆర్ మేనేజర్ పి పార్థసారధి, హెచ్ ఆర్ మేనేజర్ కర్ణకంటి సదానందం, పర్సనల్ ఆఫీసర్ శ్యామ్, విజయలక్ష్మి, యూనియన్ ముఖ్యసలహాదారుడు బత్తిని సతీష్ గౌడ్, భైరం మల్లయ్య, తీగల తిరుపతి, బూర్ల శ్రీనివాస్, సాధిక్, వెంకటేష్, ఆకుల కొమురయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాపిల్‌కిడ్స్‌లో అలరించిన బాల్‌మేళా


విద్యార్థులు తయారుచేసిన వస్తువులను తిలకిస్తున్న ఎంఈవో

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 10: గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లోని యాపిల్ కిడ్స్ స్కూల్‌లో శనివారం బాల్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో ఆరెపల్లి రాజయ్య ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రసంగించారు. పిల్లలకు నూతన విద్యావిధానంతో టీచింగ్ ఎయిడ్స్, ప్లేవే మెథడ్‌లలో బోధించడం వల్ల వారు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఆడుతూ పాడుతూ చదువుకునేలా చేస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల వస్తువులను ఎంఈవో తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గాలి సునీత, చందు, ఉపాధ్యాయురాలు, పోషకులు పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారుడికి ఆర్థిక సహాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఎన్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 10: రామగుండం పట్టణానికి చెందిన నిరుపేద క్రికెట్ క్రీడాకారుడు షానవాజ్ హుస్సేన్‌కు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గోలివాడ ప్రసన్నకుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకల శ్రీధర్‌యాదవ్ ఆర్థిక సహాయం అందించారు. శనివారం గోదావరిఖనిలోని ఎన్‌సీపీ కార్యాలయంలో క్రీడాకారుడు హుస్సేన్‌కు శ్రీధర్‌యాదవ్ శాలువ కప్పి సత్కరించి క్రీడాసామాగ్రి కొనుగోలుకు కావాల్సిన రూ. 10వేల అందజేశారు. హుస్సేన్ క్రికెట్‌లో రాణించాలని ఆశించారు. కార్యక్రమంలో ఎన్‌సీపీ నాయకులు సుంకె రాజునేత, డాక్టర్ గూడసాయిచందర్, చెన్నూరి నాగరాజు, మక్బూల్ పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎరవెల్లి ముత్యంరావు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 10: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశం పెద్దపల్లి కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికుల కనీస వేతనం పెంచుతామని తెలిపారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేస్తామని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని, పర్మినెంట్ చేసే అవకాశాలను పరిశీలిస్తామని, తమ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటి వరకు గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. పైగా అనేక గ్రామపంచాయతీలో ఆరు నెలల నుంచి ఎనిమిది నెలల వరకు వేతనాలు బకాయి ఉన్నాయన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని మరియు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్వయంగా కలిసి విన్నవించినా పరిష్కరిస్తామని చెప్పడమే తప్ప, పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో నిరవధిక సమ్మెకు కూడా దిగుతామని హెచ్చరించారు. అనంతరం యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిపెల్లి రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా, వివిధ మండలాల నాయకులు అంబాల లక్ష్మణ్, నాగయ్య, నరేష్, బందరి అశోక్, మామిడిపల్లి తిరుపతి, ఆకుల రాజయ్య, కూనమల్ల అశోక్, టి శ్రీనివాస్, వెంకటేష్, బాబన్న, కవ్వంపల్లి దేవేందర్, టి ప్రేమ్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పొలం బాట పట్టిన విద్యుత్ అధికారులు

పాలకుర్తి, ఆగస్టు 10: మండలం పరిధిలోని పుట్నూర్ గ్రామంలో విద్యుత్ అధికారులు శనివారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పెద్దపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ బొంకూరి సుదర్శన్, మంథని ఇన్‌చార్జి డివిజనల్ ఇంజనీర్ డి తిరుపతి రైతులకు పలు సూచనలు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజులు పోయినా, ఏమైనా లైన్లు లేదా పోల్స్ చెడిపోయినా వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలపాలన్నారు. కెపాసిటర్లు విధిగా బిగించుకోవాలని దాంతో మోటర్లపై, ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడదని తెలిపారు. స్టార్టర్ బాక్సులు ఇనుప వాటికి బదులు ప్లాస్టిక్‌వి వాడాలని సూచించారు. నేరుగా జిల్లా స్థాయి అధికారులు విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకొని ప్రమాదాల నివారణకు తగు చర్యలు సూచించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రాజ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ వంశీకృష్ణ, సబ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, లైన్ మెన్ తోట శ్రీనివాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

'అభివృద్ధికి ఆమడ దూరంలో మేయర్ డివిజన్'



సమావేశంలో మాట్లాడుతున్న కనకరాజ్

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 10: రామగుండం కార్పొరేషన్ మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 30వ డివిజన్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజు ఆరోపించారు. శనివారం గోదావరిఖని హనుమాన్‌నగర్‌లో సీపీఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో కూరగాయాల మార్కెట్‌కు వెళ్లే దారిలో వంతెన నిర్మించాలని అనేకసార్లు విన్నవించినా మేయర్ పట్టించుకోవడం లేదన్నారు. పాఠశాలకు వెళ్లే పిల్లలు, ఇతర అవసరాలకు వెళ్లే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక కూరగాయల మార్కెట్ దగ్గర డ్రైనేజీ దుర్వాసన వెదజల్లుతోందని, తక్షణమే కాలువను శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిటిని ఎన్నుకున్నారు. సమావేశంలో గంగారపు చంద్రయ్య, గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, దుర్గారాజ్, హకీమ్, సదానందం, శనిగరపు చంద్రశేఖర్, మల్లేష్, కనకయ్య, జైపాల్‌రెడ్డి, కరీం, హరీష్, రాజ్‌మహ్మద్ పాల్గొన్నారు.

ఇసుక డంపు స్వాధీనం

ఎలిగేడు, ఆగస్టు 10: మండలంలోని బురహాన్‌మియాపేట్‌లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును జూలపల్లి ఎస్సై శ్రీధర్ దాడిచేసి పట్టుకున్నారు. సుమారు 20టిప్పర్ల వరకు ఉంటుందన్నారు. అదే గ్రామానికి చెందిన పోతర్ల మల్లేశం స్థలంలో నిల్వ చేశారు. ఇసుక డంపును పంచనామా చేసి రెవెన్యూ వాళ్లకు అప్పగించారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయానికి ఆర్ఐ జయలక్ష్మి దగ్గరుండి తరలించారు.

జాతీయస్థాయి కళోత్సవాలు ప్రారంభం

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. శివారెడ్డి మిమిక్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏవీ లక్ష్మీనారాయణ్

జ్యోతినగర్, ఆగస్టు 10: తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఎన్‌టీపీసీలోని ఈడీసీ హాల్‌లో జాతీయస్థాయి కళోత్సవాలు, నల్లవజ్రం పురస్కారాల కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి సబ్‌రిజిస్ట్రార్, సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యునల్ ఏవీ లక్ష్మీనారాయణ్, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కళోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవీ లక్ష్మీనారాయణ్, కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతం కళాకారుల పుట్టినిల్లని పేర్కొన్నారు. ఎంతో మంది కవులు, గాయకులు, నృత్య కళాకారులు, నటులు ఒక్కటేమిటీ ఎన్నో రంగాల్లో రాణించి జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన వారున్నారన్నారు. స్థానిక కళాకారుడు, తారా ఆర్ట్స్ అకాడమీని నెలకొల్పి దేశ, విదేశాల్లో ఎన్నో కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు ఈ ప్రాంతంలోని ఎంతో మంది ప్రతిభావంతులైన కళాకారులను గుర్తించి నల్లవజ్రం పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు. డీసీపీ రాజు, ఏసీపీ ప్రతాప్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ జెడ్‌పీటీసీ కందుల సంధ్యారా ణి, సినీనటులు శివారెడ్డి మాట్లాడారు. అనంతరం కళాకారులకు నల్లవజ్రం పురస్కారాలను అతిథులు అందజేయగా సాంస్కృతిక నృత్యకార్యక్రమాలు, సినీనటుడు శివారెడ్డి చేసిన మిమిక్రీ అలరించాయి. తారా ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు సంకె రాజేష్, రామలింగారెడ్డి, కోశాధికారి మేకల శ్రీధర్‌యాదవ్, కె.స్వామి, మేజిక్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి: ప్రభుత్వ విప్

పెగడపల్లి, ఆగస్టు 10: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని బతికెపల్లి కొచ్చెరువు గుట్ట ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ. 40 లక్షలతో చేపట్టనున్న పనులను శనివారం అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అడ్లూరి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల బాగోగుల కోసం వారానికి నాలుగు రోజులు నియోజకవర్గ ప్రజలకు అందు బాటులో ఉంటానని, ప్రజలు నేరుగా వచ్చి కలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుల బారిన పడకండి

ఎస్ఐ అశోక్ రెడ్డి

ఓదెల, ఆగస్టు 10: మొబైల్ ఫోన్లలో వస్తున్న యాప్ లింకులను ఓపెన్‌చేసి సైబర్ నేరస్తుల బారిన పడవద్దని పొత్కపల్లి ఎస్ఐ అశోక్ రెడ్డి సూచించారు. మండలంలోని పొత్కపల్లిలో శనివారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్ ఆపరేటింగ్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు యాప్‌లలో డబ్బులు వచ్చాయని ఓపెన్ చేయమని లింక్‌లు పంపిస్తారని తెలిపారు. నేరుగా ఫోన్‌చేసి బ్యాంకు వివరాలు, ఆధార్‌కార్డు, క్రెడిట్ కార్డుల వివరాలు అడుగుతారని ఎట్టి పరిస్థితుల్లో వివరాలు తెలపవద్దని సూచించారు. సమాచారం ఇస్తే కొన్ని క్షణాల్లోనే మీ బ్యాంక్ ఖాతాల్లోని డబ్బు క్షణాల్లో సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లిపోతాయని హెచ్చరించారు. గ్రామాల్లో గంజాయిని సేవిస్తున్న, విక్రయిస్తున్న వారి వివరాలు తెలపాలని గ్రామస్థులను కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. మహిళలతో దురుసుగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి క్షీరాభిషేకం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 10: హర్ ఘర్ తిరంగా స్వాతంత్ర దినోత్సవాల కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో గోదావరిఖని కాకతీయనగర్‌లోని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధానకార్యదర్శి కాసిపేట శివాజీ, రాష్ట్ర మహిళామోర్చా ఎగ్జిక్యూటీవ్ సభ్యురాలు సోమారపు లావణ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఎంతో మంది బలిదానాలు చేశారన్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకోవడం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి రవీందర్, సుల్వా ల క్ష్మీనారాయణ, శివరాం, మండల అధ్యక్షులు నవీన్‌గౌడ్, సునీల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లతో తీసుకువచ్చి .. లారీల్లో నింపుతూ..

- గుట్టు చప్పుడు కాకుండా రాత్రి పూట ఇసుక అక్రమ రవాణా


గర్రెపల్లిలో సీజ్ చేసిన ఇసుక డంప్(ఫైల్)

సుల్తానాబాద్, ఆగస్టు 10: మానేరు వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా నిర్మానుష్య ప్రాంతాల్లో డంప్ చేసి రాత్రిపూట ఇసుకను యథేచ్ఛగా అక్ర మంగా రవాణా చేస్తున్నారు. మానేరు పరివాహక ప్రాంత నుంచి ట్రాక్టర్ యజమానులకు మానవతా దృక్పతంతో కల్పించిన వెసులుబాటును కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. మానేరు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను పెద్ద ఎత్తున తరలిస్తూ రహస్యంగా డంప్‌లు ఏర్పాటు చేసుకుని అక్కడ నిలువు చేసుకుంటున్నారు. రాత్రిపూట గుట్టు చప్పుడు కాకుండా ఏకంగా లారీల్లో ఇసుకను హైదరాబాద్ వంటి నగరాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటు న్నారు. ఇలా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ లారీని పోలీసులు పట్టుకోవడంతో వీరి గుట్టు రట్టయింది. పెద్ద ఎత్తున ట్రాక్టర్ల ద్వారా ఇసుకను స్థానిక అవసరాల పేరిట తరలించి, డంప్‌ల వద్ద పోసిన ట్రాక్టర్ యజమానులపై, అక్రమంగా ఇసుక డంపులు నిర్వహిస్తున్న వారిపై, లారీల్లో నింపి అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోవడం గమనార్హం. కేవలం పట్టుకున్న లారీ పైనే కేసు నమోదు చేశారు.

● **స్థానిక అవసరాలకు ఇసుక అనుమతి..**

మానేరు పరివాహక ప్రాంత గ్రామాల ప్రజల అవసరాల కోసం ఆయా గ్రామాల్లోని ఇసుక ట్రాక్టర్ల యజమానుల ఉపాధి కోసం ఈ ప్రాంత ప్రజా ప్రతినిధి వారికి ఓ వెసులుబాటును కల్పించారు. స్థానిక అవసరాల కోసం ప్రజలకు కూడా చాలా చవకగా ఇసుక లభిస్తోంది. అయితే కొంత మంది దళారులు ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని పగలంతా పలు ట్రాక్టర్ల ద్వారా పెద్ద ఎత్తున ఇసుక తరలిస్తూ అక్రమ డంపుల వద్ద నిలువ చేయిస్తున్నారు. రాత్రి వేళలో లారీల ద్వారా హైదరాబాద్‌తో ఇతర పట్టణాలకు పంపిస్తున్నారు. దాంతో లక్షల చొప్పున అక్రమార్జన చేస్తున్నారు.

ఇసుక లారీ పట్టివేత..

సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల గ్రామం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు నలుగురి పై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. ఈ అక్రమ ఇసుక రవాణా కేసుకు సంబంధించి పూసాల రవి, చొప్పరి శివ, ముడావత్ లక్ష్మణ్, అంతడుపుల మహేష్ లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.